మినీ కథ

# కథకాని కథ

పడాల రాములు

తలుపు తట్టిన చప్పుడైంది.

ఎవరా! అనుకుంటూ లేచివెళ్ళి తలుపు తెరిచాడు సుధాకర్. ఎదురుగా ఓ అపరిచిత స్త్రీ! ముప్ఫయ్యయిదేళ్ళుంటాయేమో, నల్లగా, సన్నగా, పొడుగ్గా వుంది. రంగు వెలిసిన చీర, చిరుగులు పడ్డ రవిక, మొహంలో దీనత్వం ఉట్టిపడుతోంది. చేతిలో చిన్నసంచీ వుంది.

సుధాకర్‌ని చూడగానే వినయంగా నమస్కరించిందామె.

ప్రతి నమస్కారం చేసి—"ఏం కావాలి?" అని అడిగాడు సుధాకర్.

ఆమె సమాధానం చెప్పలేదు. కానీ "ఆ...." అంటూ నోరు తెరిచింది, చిటికెన వేలితో నాలుక చూపించింది.

సుధాకర్ కళ్ళు చికిలించి చూశాడు. ఆమె నాలుక బాగా లోపలికి కుంచించుకుపోయివుంది. వెంటనే విషయం అర్థమైందతనికి.

"ఐతే నీకు మాటలు రావన్నమాట." అన్నాడు తాపీగా.

అవునన్నట్టు తల ఆడించిందామె.

"కాదు. పైసాకోసం మూగదానిలా నటిస్తున్నావ్. అవునా?" తీక్షణంగా చూస్తూ అన్నాడు.

ఆమె అడ్డంగా తలాడించింది. అప్పుడామె కళ్ళలో ఆవేదన, బాధ స్పష్టంగా తెలిశాయతనికి.

చేతి సంచీలోంచి ఓ కరపత్రం తీసి సుధాకర్‌కి అందించిందామె. అందులో....

మహాశయులారా!

ఈమె పేరు రంగాజమ్మ. పుట్టు మూగి. చిన్నతనంలోనే తల్లిదండ్రులు అగ్ని ప్రమాదానికి గురై పరమ పదించారు. సహృదయులైన ఓ బాబాగారు ఈమెని పెంచి పెద్దచేసినారు. కాగా ఈమె దురదృష్టవశాత్తూ బాబాగారూ ఈమధ్యనే స్వర్గస్తులయినారు. ప్రస్తుతం ఈమెకు 'నా' అన్న వారెవ్వరూ లేరు. ఆస్తిపాస్తులు ఏమీలేవు. విశేషమేమిటంటే ఈమె అజన్మ బ్రహ్మచారిణి. కన్యకాపరమేశ్వరీ దేవి భక్తురాలు. కనుక దాతలైన మీరు ఈమె ఉదర పోషణార్థం తృణమో పణమో యిచ్చి పుణ్యం సంపాదించుకోగలరనీ, ఇటువంటి దైవ భక్తులకు సహాయం చేసినచో ఆ భగవంతుడు మీకు ఇతోధికంగా సిరిసంపదలు ప్రసాదించగలడనీ మనవి చేస్తున్నాము.

ఇట్లు
సర్పంచ్ అండ్ గ్రామప్రజలు
కూచనపల్లి గ్రామము.

సుధాకర్ గుండె జాలితో నిండిపోయింది. పాపం! దురదృష్టవంతురాలు! అనుకుంటూ ఆ కరపత్రాన్ని ఆమెకిచ్చేశాడు.

దాన్ని జాగ్రత్తగా సంచీలో పెట్టుకుని ఓ నోట్ బుక్ తీసి చూపించిందామె.

అందులో విరాళాలిచ్చిన వాళ్ళ పేర్లు, ఊర్లు రాసున్నాయి.

సుధాకర్ తనపేరు రాసి, అంకె వేసాడు పుస్తకంలో.

ఆమె నిర్లిప్తంగా చూస్తోందతనికేసి.

సుధాకర్ మౌనంగా జేబులోంచి పది రూపాయల నోటొకటి తీసిచ్చాడామెకి.

ఆమె కళ్ళు ఆనందంతో, తృప్తితో వెలిగిపోయాయి. మరోసారి సుధాకర్‌కి నమస్కరించి మెల్లగా ముందుకు సాగిపోయింది.

ఆమె కనుమరుగయ్యేదాకా అటే చూస్తూ ఉండిపోయాడు సుధాకర్.

○ ○ ○ ○

"మరదలా! ఇయ్యాల సంపాదనెంతే?"

"పది!"

■

# మొదలెక్కడ..?

— యర్రంశెట్టి శాయి



"ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి—
మా వదినే ఈ జగతికి జీవనజ్యోతీ...."

అని పాడేస్తూ వరండాలో సైకిల్ స్టాండ్ వేసి లోపలికొచ్చాడు గోపాలరావ్.

"ఇంక చాల్లే ఆపునాయనా! 'టీ' రెడీగానే ఉంది! నన్నేం కాకా పట్టనక్కర లేదు...." చిరాకు నటిస్తూ అంది కౌసల్య.

"ఛఛ! కాకా కాదొదినా! ఫాక్ట్ చెబుతున్నానంతే! నువ్వు లేకపోతే...."

"ఆ భజన ఆపకపోతే 'టీ' కాన్సిల్ చేస్తాను" బెదిరింపుగా అంది కౌసల్య.

"ఓకే! ఆపేశాను!" కుర్చీలో కూలబడి నిశ్శబ్దంగా ఉండిపోయాడు గోపాలరావ్.

కౌసల్య 'టీ' తేవడానికి వంటింటి వేపు వెళ్ళింది.

ఈలోగా శీనుగాడు హడావుడిగా బయటనుంచి లోపలికి సుడిగాలిలా దూసుకొచ్చాడు.

"బాబాయ్! ఫుట్‌బాల్ ఆటలో వెనక్కు తిరిగి బ్లాక్ చేయడం ఫౌల్ కదూ?"

"అవును!" ఒప్పుకున్నాడు గోపాలరావ్ కేచీ ఎందుకని.

శీను మళ్ళీ అదే స్పీడుతో బయటకు దూసుకుపోయాడు.

కౌసల్య 'టీ' కప్పు తీసుకొచ్చి గోపాలరావ్ ముందు టేబుల్ మీద ఉంచింది.

"థాంక్యూ వదినా! థాంక్యూ థాంక్యూ థాంక్యూ! నీకు తెగ ఋణపడిపోతున్నాను. ఎలా తీర్చుకుంటానో ఏమో!...."

"ఋణం లేదు గిణం లేదుగానీ త్వరగా 'టీ' తాగు. నీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి!"

"ఏమిటది? పేకాట విషయమేనా! ప్రమాణం వదినా! నిజంగానే మానేశాను"

"అది కాదయ్యా దేవుడా! వేరే విషయం...."

"ఏమిటది?"

"నా తలకాయ!" విసుగ్గా అందామె.

"నీ తలకేం వదినా! అది చాలా గొప్పదని మన వాళ్ళందరూ పొగుడుతారు కదా! అన్నయ్య మాత్రం 'నీది పట్టీ డల్ హెడ్' అంటాడనుకో! అన్నయ్య మాటలు నేను ఎగ్రీ అవడం లేదు!"

"అయ్యో! అత్తయ్య నీకు ఇంత 'వస' ఎందుకు పోసిందో?"

"ఆరోజుల్లో అదొక్కటే విరివిగా లభించేదట! అందుకని పోసి ఉంటుంది...."

"మాటలు ఆపుతావా—నన్ను ఇక్కడి నుంచి వెళ్ళమన్నావా?"

"వెరీ డిఫికల్ట్ ఛాయిస్! ఓకే! మాట్లాడమే ఆపేస్తాను. ఎందుకంటే ఏదో ముఖ్యమయిన విషయం మాట్లాడాలన్నావుగా? ఎవరయినా సరే—ఏ చిక్కు సమస్య ఎదురయినా నన్నే అడుగుతుంటారు సాధారణంగా—మొన్న మా లక్ష్మణరావ్ కూడా...." కౌసల్య అతని వంక చిరాగ్గా